క్లుప్తంగా

రామానుజాచార్యులకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

టేకులపల్లి: మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో రామానుజచార్యుల విగ్రహం ప్రతిష్ఠించి 48 రోజులు అయిన సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామానుజాచార్యులకు అభిషేకం, హోమగుండం పూజలు అర్చకుడు శ్రీరంగం అజయ్‌సాయి చక్రి చేత చేశారు. కె.చెన్నకేశవరెడ్డి దంపతులు, సర్పంచ్‌లు బోడ నిరోషా, బోడ సరిత, మంగీలాల్, బోడ జ్యోతి, సబిత, పోటు నాగమణి పాల్గొన్నారు.

గోటి తలంబ్రాల తయారీ



తలంబ్రాలను తయారు చేస్తున్న మహిళలు

టేకులపల్లి: నవమికి భద్రాచలంలోని శ్రీ సీతారాముల కల్యాణానికి ఉపయోగించే గోటి తలంబ్రాల తయారీ కార్యక్రమం మంగళవారం టేకులపల్లి రామాలయంలో నిర్వహించారు. స్థానిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా భక్తులు, ప్రజాప్రతినిధులు భక్తిశ్రద్ధలతో వడ్లను ఒలిచి తలంబ్రాలు సిద్ధం చేశారు.

మైనార్టీలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయండి

కొత్తగూడెంఅర్బన్: గత ప్రభుత్వ హయాంలో పేద మైనార్టీ వర్గాల మహిళలకు మంజూరు చేసిన కుట్టు మిషన్లను ప్రస్తుతం వెంటనే పంపిణీ చేయాలని జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో కలెక్టర్‌ను కోరారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో, ప్రతి నియోజకవర్గానికి 100 మంది చొప్పున 500 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు కేటాయించి అర్హులైన వారి జాబితాను కూడా రూపొందించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా పినపాక నియోజకవర్గం తప్ప మిగిలిన కొత్తగూడెం, ఇల్లందు, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో నేటి వరకు పంపిణీ జరగలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున అధికారులు కుట్టుమిషన్లను పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ప్రజాపాలన సన్నాహక సమావేశం

సుజాతనగర్: 28వ తేదీ నుంచి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజాపాలనకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేటి మధ్యాహ్నం 2 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకమండలి సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సాహితీ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావు జాతీయ స్థాయి సాహితీ అవార్డు అందుకున్నారు. ఆదివారం కరీంనగర్ ఫిలిం భవన్‌లో ఆర్యాణి సకల కళా వేదిక, శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావుకు జాతీయ అవార్డును ప్రముఖ సాహితీ విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్, ఆర్యాణి కళావేదిక చైర్మన్ శ్రీధర్, గాయకుడు సుబ్రహ్మణ్యం దీక్షితులు, రచయిత్రి రోజా రమణి అందించారు. ఈ మేరకు వివరాలను మంగళవారం స్థానిక విలేకరులకు అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు వెల్లడించారు.

కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని కరెంటాఫీస్ వద్ద సోమవారం రాత్రి అకారణంగా తన మీద దాడి చేశారంటూ ఇల్లెందు కరెంటాఫీఎస్ ఏరియాకు చెందిన తెల్లం రాజ్‌కుమార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆటోలో వెళ్తుండగా గవర్నమెంట్ ఆస్పత్రి ఏరియాలో ఆటోను ఢీకొట్టారని... ప్రశ్నించగా దాడి చేశారని తెలిపారు. రాత్రి సమయంలో అదే సెంటర్‌లో మరోమారు అదే ఏరియాకు చెందిన సారయ్య మరికొంత మందితో వచ్చి దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

సింగరేణి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- కొత్తగూడెంలో 3,522 మంది, ఇల్లెందు ఏరియాలో 614 మంది ఓటర్లు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎన్నికల అధికారులు
- నేడు పోలింగ్



సింగరేణి(కొత్తగూడెం): ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇల్లెందు ఏరియాలో జీఎం కార్యాలయం, జేకే ఓసీ, కేటీసీల్లో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో జీఎం కార్యాలయంలో 274 మంది ఓటర్లు, జేకే ఓసీలో 218 మంది ఓటర్లు, కేటీసీలో 122 మంది ఓటర్లు మొత్తం ఏరియాలో 614 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రతీ కార్మికుడు గుర్తింపు కార్డుతో హాజరై ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇల్లెందు ఏరియా ఎన్నికల అధికారి(ఆర్‌ఓ) సంతోష్‌కుమార్ మహూర్ సూచించారు. ఇల్లెందులో మంగళవారం ఆయన మాట్లాడుతూ... పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి ఉండదని, కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు గాను కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలో నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కార్పొరేట్ కార్యాలయంలో ఉద్యోగులకు పోలింగ్ సామగ్రిని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌ఓ) రామదుర్గాప్రసాద్ సిబ్బందికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్పొరేట్ ఏరియాలో 1,191 మంది ఓటర్ల కోసం నాలుగు బూత్‌లు ఏర్పాటు చేయగా, 16 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. కొత్తగూడెం ఏరియాలో 2,331 మంది ఓటర్ల కోసం మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో రుద్రంపూర్‌లోని (ఏజెంట్ ఆఫీస్, జీకేటీసీ క్యాంటిన్, ఏరియా వర్క్‌షాపు) మూడు పోలింగ్ కేంద్రాలు, అదేవిధంగా మూడు పోలింగ్ కేంద్రాలు, జేవీఆర్‌ఓసీ–2 రెస్ట్ హౌజ్, జేవీఆర్ సీహెచ్‌పీ, కిష్టారం వీటీసీ హాల్)లలో ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ ఉంటుందని, ఆ తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను కార్పొరేట్ కార్యాలయంలోని కౌటింగ్ స్టాల్‌కు తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు జక్కం రమేష్, బి.హనుమంతరావు, రమేష్‌కుమార్, అజయ్‌కుమార్, వరప్రసాద్, మూర్తి పాల్గొన్నారు.

కార్మికులకు తాయిలాల పర్వం...

గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం జరగనుండగా, ఎన్నడూ లేని విధంగా సార్వత్రిక ఎన్నికలను తలపించేలా యూనియన్ల నాయకులు వ్యవహరిస్తున్నారు. హోటళ్లలో గదులు బుక్ చేసుకుని కార్మికులు, ఉద్యోగులకు పిలిపించి బహుమతులు ఇస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మూడు రోజులుగా విందు, మందు సమకూరుస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. కొన్ని యూనియన్ల నాయకులైతే సూపర్ మార్కెట్లలో సరుకులు తీసుకునేలా స్లిప్పులు ఇస్తున్నట్లు సమాచారం.



ఇల్లెందు: ఎన్నికల వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌ఓ సంతోష్‌కుమార్

హామీలు అమలు చేయాలి



గెలిచిన సంఘం కార్మిక వర్గానికి న్యాయం చేయాలి, అంతేకాకుండా కోలిండియాలో అమలవుతున్న హక్కులను సింగరేణిలో అమలు చేసేందుకు జాతీయ కార్మిక సంఘాలు కృషి చేయాలి. నూతన బొగ్గుబావులు ఏర్పాటు చేసి బొగ్గునిక్షేపాలను పెంచి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి.

– నాగేశ్వరరావు, ఓసీ ఉద్యోగి, కొత్తగూడెం

కార్మికుల హక్కులు సాధించాలి



గతంలో గెలిచిన యూనియన్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయలేదు. దీంతో కార్మికులు యూనియన్ల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ సారైనా గుర్తింపు సంఘంగా ఎన్నికయ్యే యూనియన్ కార్మికుల హక్కులను కాపాడేందుకు పాటుపడాలి.

– గుండ్లపల్లి రాజశేఖర్, ఎస్‌ఎన్‌పీసీ, ఇల్లెందు

సింగరేణి పరిరక్షణ జరగాలి..



సింగరేణి పురిటిగడ్డ ఇల్లెందును పరిరక్షించాలి. నిర్వీర్యమైపోతున్న బొగ్గు పరిశ్రమను కాపాడేందుకు కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసేందుకు ఈ ఎన్నికలు ఉపయోగపడాలి. పరిశ్రమను కాపాడితే కార్మికులకు ఉపయోగం. రాబోయే గుర్తింపు సంఘం ఆ దిశగా కృషి చేయాలి..

– బండి రాము, మెకానిక్, జేకేఓసీ, ఇల్లెందు

మున్సిపాలిటీలో మళ్లీ ఇన్‌చార్జ్ పాలనే...



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

ఇల్లెందు: మళ్లీ ఇల్లెందు మున్సిపాల్టీ ఇన్‌చార్జ్‌ల పాలనలోనే మగ్గుతోంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఇల్లెందు మున్సిపాల్టీకి రెగ్యులర్ కమిషనర్ నియామకం జరగలేదు. ఒక్కరిద్దరు నియామకం అయినప్పటికీ నెలా, రెండు, మూడు నెలలకు మించి ఆ సీటులో ఉండలేదు. ఇక పాలక వర్గం ఏర్పాటు అయిన తర్వాత అంతా ఇన్‌చార్జ్ కమిషనర్లే పని చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతనైనా పూర్తి స్థాయి కమిషనర్ నియామకం జరుగుతుందా అనుకుంటే ఇక్కడి కమిషనర్ యాదగిరి 15 రోజుల క్రితం దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. దీంతో డీఈ నవీన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ కమిషనర్ లేకపోతే ఇతర విభాగాలలో పని చేసే వారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించటం, వారితోనే పాలన నెట్టుకుని రావటం పరిపాటిగా మారింది. అంతేగాక రెండు శాఖలను ఒకే అధికారి పర్యవేక్షించాల్సి ఉండటంతో రెండు శాఖలకు సరైన న్యాయం జరగదని స్థానికులు వాపోతున్నారు. 2020 మార్చి 3 నుంచి 2022 సెప్టెంబర్ 27 వరకు ఎంపీడీఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 సెప్టెంబర్ 28 నుంచి 2022 ఏప్రిల్ 18 వరకు మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేకుమార్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఉన్నారు. 2022 ఏప్రిల్ 19 నుంచి 2023 జులై 26 వరకు మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక ఏఈ కుమారస్వామి 2023 జులై 27 నుంచి 2023 సెప్టెంబర్ 12 వరకు బాధ్యతల్లో ఉన్నారు. 2023 సెప్టెంబర్ 13 నుంచి 2023 అక్టోబర్ 15 వరకు మున్సిపల్ డీఈ నవీన్ బాధ్యతలు నిర్వహించారు. 2023 అక్టోబర్ 16 నుంచి ఈ నెల 11 వరకు కమిషనర్ యాదగిరి పని చేశారు. ప్రస్తుతం మళ్లీ డీఈ నవీన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి యాదగిరి సెలవులో ఉన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల చెల్లించేందుకు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ చలాన్లపై రాయితీల వర్తింపుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని, దాని ప్రకారం టూ వీలర్స్, త్రీ వీలర్స్‌పై 80 శాతం రాయితీ, కార్లపై 60 శాతం, ఆర్టీసి బస్సులపై 90 శాతం రాయితీ ఉందని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది ?

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి పాతకొత్తగూడెం నాలుగో వార్డులో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు డ్రెయినేజీల్లో సిల్ట్ పేరుకపోయి దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, మురుగు పేరుకపోవడంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం కరోనా ప్రభావం ఉండడం వలన మరింత జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నా... పారిశుద్ధ్య పనులు చేయడం లేదంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి, సిబ్బంది చేత రెగ్యులర్‌గా పారిశుద్ధ్య పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గంలో ఆధార్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకుడు యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆధార్ కార్డులో కొత్త కొత్త సమస్యలు వస్తున్నాయని వాటిని పరిష్కరించాలంటే ఆధార్ సెంటర్లు తక్కువగా ఉన్నాయన్నారు. ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్ చేయాలన్నా సరే ఆధార్ కార్డులో పుట్టిన తేదీ, సంవత్సరం తదితర వివరాలు పొందుపర్చాలన్నా చాలా సమయం పడుతోందని, మీ సేవ కేంద్రాల్లో రోజుకు నలభై మందికి, మిగతా కేంద్రాల్లో కేవలం ముప్పై మందికి మాత్రమే టోకెన్లు జారీ చేయడంతో జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి చలిలో ప్రజలు వచ్చి ఆధార్ కేంద్రాల వద్ద అర్ధరాత్రి నుంచే క్యూలైన్‌లో పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. జిల్లా కేంద్రం కావడంతో చాలా సమస్యలపై ప్రజలు వస్తున్నారని తెలిపారు. రామవరం, రుద్రంపూర్, సుజాతనగర్, చుంచుపల్లి, నవభారత్, పాల్వంచ, పెద్దమ్మతల్లి దేవాలయం తదితర ప్రాంతల్లో కొత్తగా ఆధార్ కేంద్రాలను మంజూరు చేయాలని, అదేవిధంగా ఉన్న ఆధార్ కేంద్రాల్లో కౌంటర్లు పెంచి ఎక్కువ మందికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. సమావేశంలో గంధం మల్లికార్జున్‌రావు, చెనిగారావు నిరంజన్‌కుమార్, నాగుల రవికుమార్, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామేష్

'కస్తూర్బా' విద్యార్థులకు దుస్తులు అందజేత



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాల్వంచ: ములకలపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు పాల్వంచ బాపూజీనగర్‌కు చెందిన యేసు కరుణా సువార్త స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు క్రిస్మస్ పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేసినట్లు మంగళవారం తెలిపారు. నిరుపేదలకు తన వంతు సంస్థ తరుపున గత తొమ్మిదేళ్లుగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ సురేశ్, ప్రెసిడెంట్ ప్రభుదాస్, కొండ్లె రవి, సురేశ్, విజయ్‌బాబు, కాటయ్య బాబు, మధు, కిట్టు, రాజు, కృపాకర్, లక్ష్మణ్, జగదీశ్, దశరథ్, శ్రీను, బబ్లు, శివ, సత్యం, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ప్రజాపాలన గ్రామ సభలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కమిషనర్ నవీన్

ఇల్లెందు: నూతన ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఇందుకు ఇల్లెందు మున్సిపాల్టీలోని 24 వార్డులలో గ్రామసభలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ప్రతీరోజు మూడు వార్డులలో సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు వార్డులలోనూ మూడు టీంలను ఏర్పాటు చేసి సూపర్‌వైజర్, వార్డు ఆఫీసర్,, టీం అసిస్టెంట్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా నిర్ణీతకాలంలో సామాజిక భద్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలను నెరవేర్చేందుకు ఈ ప్రణాళిక రూపొందించినట్లు ఇల్లెందు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ నవీన్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలను అమలు చేసేందుకు వార్డు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28న 1వ వార్డు, 19, 20 వార్డులలో సభలు నిర్వహించనున్నారు. 29న 22వ, 2వ, 3వ వార్డుల్లో, 30వ తేదీన 4వ, 5వ, 6వ వార్డులో గ్రామసభలు నిర్వహించనున్నారు. జనవరి 2వ తేదీన 7వ, 8వ, 9వ వార్డులో గ్రామసభలు, 3వ తేదీన 10,11,12వ వార్డుల్లో గ్రామసభలు ఉంటాయని తెలిపారు. 4వ తేదీన 13,14,15 వార్డులలో, 5వ తేదీన 16,17,18 వార్డులలో గ్రామసభలు ఉంటాయని పేర్కొన్నారు. చివరి రోజు 6వ తేదీన 21,23,24వ వార్డులలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిపోర్టింగ్ అధికారులుగా జూనియర్ అసిస్టెంట్ ఎం.లలిత, బి.సుధీర్‌లను నియమించారు. ఒక్కొక్కరికి 12 వార్డులను కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు డీఈఓ సి.మధు, యు.శివ, సీహెచ్.లలితలతో పాటు ఎస్‌ఎం ఎల్.గణేష్‌లకు ఒక్కొక్కరికి ఆరు వార్డులను కేటాయించారు.

ఆర్టీసీ హమాలీల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న హమాలీ వర్కర్లు

చుంచుపల్లి: ఆర్టీసీలో పనిచేస్తున్న హమాలీ వర్కర్లు, ఏఎన్‌ఎల్, లాజిస్టిక్ కొరియర్ పార్సిల్ సర్వీస్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కొత్తగూడెం బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కందుల భాస్కరరావు మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలు నుంచి ఆర్టీసీలో పని చేస్తున్న హమాలీ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ లేకుండా వెట్టిచాకిరీ చేస్తున్నారని ఈ విషయంలో యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు.

అందరికీ గతంలో ఇచ్చిన విధంగా పాత పద్ధతి ప్రకారం కమీషన్ ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం డిపో అధ్యక్ష, కార్యదర్శులు కొమరయ్య, రాజు, వెంకట్, నరేష్, వెంకట్రావు, గంగరాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మద్దెల శివకుమార్ తదితరులు

కొత్తగూడెంరూరల్/సింగరేణి(కొత్తగూడెం): కార్మిక పక్షపాతి పేదల, దళిత జనబాంధవుడు స్వర్గీయ వెంకటస్వామి (కాక) సేవలు చిరస్మరణీయమని భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దెల శివకుమార్ పేర్కొన్నారు. వెంకటస్వామి వర్ధంతి వారోత్సవాలను స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా కాకా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గిడ్ల పరంజ్యోతి, కలవాల రాందాస్, చుంచుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంతోటి పాల్, బొమ్మెర శ్రీనివాస్, అల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా పేదలకు అన్నదానం, దుస్తులు పంపిణీ చేశారు. మంగళవారం చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కనకయ్య మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా పేదలకు వితరణ చేయడం అభినందనీయమన్నారు. ప్రతీ సంవత్సరం పేదలకు సీఎస్‌ఐ చర్చిలో సేవా కార్యక్రమాలు అనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు. పాస్టర్ రెవ ఫ్రాంక్లిన్, సుధాకర్, సెక్రెటరీ ఏసు రత్నం, జయరాజ్, స్త్రీల మైత్రీ అధ్యక్షులు సామ్రాజ్యం, సెక్రెటరీ నిర్మల జ్యోతి, కోశాధికారి మేరీ జాన్, సుకన్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ధాన్యం వ్యాపారుల వినతి

ఇల్లెందురూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు వాటిని లారీలలో మిల్లుల వద్దకు తరలిస్తుంటారు. ఈ ప్రక్రియను ఇప్పటి వరకు వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన లారీలో పంటను రవాణా చేశారు. కానీ అటువంటి సంప్రదాయం ఇల్లెందులో లేదని, స్థానిక లారీలనే వినియోగించాలని లారీ యజమానుల సంఘం స్పష్టం చేస్తోంది. ఇదే విషయమై బయటి లారీలను వినియోగించవద్దని వ్యాపారుల సంఘానికి లారీ యజమానుల సంఘం లేఖ పంపింది. గతంలో ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు ఇరువర్గాలు కూర్చుని సమస్యను పరిష్కరించుకునేవారు. లేదంటే ప్రజాప్రతినిధులను ఆశ్రయించేవారు. అయితే ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్న సమయంలో లారీ యజమానుల ఆంక్షలకు తలొగ్గితే రానున్న రోజుల్లో ఇదే సంప్రదాయాన్ని కొనసాగించాల్సి వస్తుందని భావించిన వ్యాపారులు నేరుగా ఎమ్మెల్యే కోరం కనకయ్యను మంగళవారం కలిసి సమస్యను వివరించారు. స్థానిక లారీలను మాత్రమే వినియోగించడం వల్ల తమకు నష్టం వాటిల్లుతుందని వాపోయారు. ఈ విషయంలో ఇరువర్గాలతో చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వ్యాపారుల సంఘం ప్రతినిధి మెట్టెల కృష్ణ తెలిపారు.

ప్రజా ఉద్యమాలే సీపీఐకి ఆయుధం..

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో భారత కమ్యూనిస్ట్ పార్టీ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, ప్రజల కోసం, ప్రజా హక్కులకోసం రాజీలేని పోరాటాలు చేసే సత్తా కమ్యూనిస్టుల సొంతమన్నారు. బందెల విజేందర్, చంద్రగిరి శ్రీనివాస్‌రావు, సలిగింటి శ్రీనివాస్, దమ్మాలపాటి శేషయ్య, కంచర్ల జమలయ్య పాల్గొన్నారు.

సుజాతనగర్: సమస్యల కోసం పోరాడుతూ సమసత్వాన్ని చూపేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సుజాతనగర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బండి రమేష్, హనుమంతరావు, జక్కుల రాములు, భాస్కర్, పాల్గొన్నారు.

జూలూరుపాడు: సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ కాలనీలో పార్టీ స్థూపం వద్ద ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్ర కుమార్ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలతోనే సీపీఐని బలోపేతం చేయాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, చింతా స్వరాజ్‌రావు, యల్లంకి మధు పాల్గొన్నారు.

టేకులపల్లి: సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి ఎర్ర జండా ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. సీపీఐ టేకులపల్లి మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్, రామచందర్, ఎజ్జు భాస్కర్, అయిత శ్రీరాములు, కంగాల రాంబాబు పాల్గొన్నారు.

పాల్వంచ: ప్రజా ఉద్యమాలే సీపీఐకి ఆయుధమని, సమ సమాజ నిర్మాణం కోసం ఆవిర్భవించిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. మంగళవారం సీఆర్ భవన్ ఎదుట అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం, పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలతో ప్రజా చైతన్యాన్ని రగిలించిన పార్టీ అన్నారు. అడుసుమల్లి సాయిబాబు, పూర్ణచందర్‌రావు, నాగేశ్వరరావు, రాహుల్, పద్మజ, నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.



పాల్వంచ: అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ముత్యాల విశ్వనాథం



సుజాతనగర్‌లో జెండా ఎగరేస్తున్న నాయకులు



జూలూరుపాడులో జెండా ఆవిష్కరిస్తున్న చంద్ర నరేంద్రకుమార్



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న సాబీర్‌పాషా



టేకులపల్లిలో వేడుకలో పాల్గొన్న నాయకులు